# మామిడి చెట్టు

అయిదు వందల చదరపు గజాల జాగాని వాపీకూప తటాక నిధి నిక్షేప ఆరామ సహితంగా కొనుక్కొని అందులో ఇల్లు కట్టించుకున్నారు నీలమణిగారు. కట్టించుకొని అందులో అప్పుడప్పుడే గృహప్రవేశం చేసేరు; నేనూ అద్దెకి దిగేను. జాగాతో ఆయనకి వచ్చిన ఆరామం – ఒక మావిడిచెట్టు.

నాకు మావిడి చెట్లంటే మహచెడ్డ ఇష్టం. ఏ మావిడి చెట్టునైనా సరే ఎంత సేపైనాసరే అలా చూస్తూ కూర్చోగలను. నాకు ఉండే కొద్దిపాటి తీయని తలపులు కూడా మావిడిచెట్లకే అల్లుకుపోయేయి.

పదేళ్ళ క్రితం – అంటే నాకు పదిహేనేళ్ళ వయసులో – మావూళ్లో ఒకనాటి మధ్యాహ్నం, ఊరవతల, ఉత్తరాన, చేలకి ఆవల, పొలాల అంచున, ఆకాశంలో నల్లని మబ్బులు కంటికి చల్లగా లేస్తూండగా, ఇటు ఎండ మాత్రం పాదరసంలా తళతళా మెరిసిపోతూ, గాలితో పాటు పండిన పొలాలమీద పరిగెడుతూండగా, ఊరి చివర నూతిపక్క నేనొక పూచిన మామిడి మొక్కని చూసేను. దాని సొంపు నేను సరిగా వర్ణించలేను. అత్తవారింటికి వెళ్ళడానికి సిద్ధంగా వున్న ముగ్ధలా ఉందది. ఎండలో, లేతగా బరువుగా కొంచెం జాలిగా కనిపిస్తోంది. ఆ సమయంలో ఆ గాలిలో బేలగా అసహాయగా కనిపించింది.

ఆ మధ్యాహ్నపువేళ, ఆ నూతిలోంచి నీళ్లు తోడుకొని, ఒక చేత్తో రేకు చేద పట్టుకొని, తలమీద నీళ్ళకుండతో ఆ ఎండలో అతి ఒంటరిగా ఒక అమ్మాయి, అత్తవారింటికే కాబోలు, నెమ్మదిగా వెళ్తోంది. ఆభరణాల్లేకపోయినా ఆమె వంటినిండా – ఆమె లేత శరీరం పట్టజాలనంతగా – అందం ఉంది. కుండలోని నీళ్ళు కిందకి జారి, ఆమె జుట్టులోంచి నెమ్మదిగా జారి ఆమె చెంపల్ని జాలిగా తాకుతున్నాయి. ఆనాటి ఎండలో అసహాయగా అతి అందంగా నిల్చున్న ఆ మామిడి మొక్కా, నీళ్ళతో నెమ్మదిగా ఒంటరిగా నడుచుకుపోయే ఆ పల్లె పిల్లా జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా, బ్రతుకులోని శ్రమా సౌందర్యం, కష్టం, కమ్మదనం, బరువూ బాధా అన్నీ నాకు అతి తీవ్రంగా గుర్తుకొస్తాయి.

ఆ రోజున ఆ పిల్ల, ఎండలో మబ్బులా, చూడ్డానికి ఎంతో చల్లగా ఉంది. ఆమెకీ

ఆ పూచిన లేమామిడికీ నా మనసులో ఎందుకోగాని మెలిపడి పోయింది. ఏ మధ్యాహ్నం వేళ మబ్బుని చూసినా నాకు తటాల్న ఆ పూచిన మామిడిమొక్కా, నీళ్ల తెచ్చే ఆ చల్లనిపిల్ల రూపూ గుర్తుకొస్తాయి. మధురంగా ఏ పాట నా చెవిని పడినా, ఆ నాటి ఆ దృశ్యం - ఊరంతా బలబల ఒలికే ఎండా, చేలవతల చల్లటి మబ్బూ, ఆ నుయ్యీ, ఆ మొక్కా, ఒంటరిగా ఆ పిల్లా - ఆ దృశ్యమంతా నా కళ్ళముందు కదలాడి, నాకు గొప్ప సుఖంగానూ అమిత బాధగానూ ఉంటుంది. గాలిలో రేగే పైరు కెరటాలూ, మామిడి తోటల్లో ఏటిగాలి పాటలూ, పల్లెపదుచులూ, నల్ల మబ్బులూ, నా మనసులో వింతగా మెలిపడి అందంగా అల్లుకుపోడం జరిగింది.

అందుచేతనే, నీలమణిగారు తమ ఇంటి ముందు వైపు గది గురించి అద్దె నెలకి ఇరవై రూపాయలు చెప్పినా, అది నాకు హెచ్చుగా తోచినా, వారి ఇంటి ముందున్న మావిడి చెట్టుని చూసి, సరే అని వప్పేసుకున్నాను. అంతకంటె చవగ్గా రెండుమూడు చోట్ల గదులు చూసేను. కాని అవి ఇరుగ్గానూ కనుచూపు మేరలో ఏ పచ్చని మొక్కా లేకుండానూ ఉన్నాయి. అందుచేత నీలమణిగారి నియమాలకి వప్పేసుకొని వారి గదిలో దిగిపోయేను.

నీలమణిగారు చాలా నియమాలు పెట్టేరు. ఒకటో తారీఖు సాయంకాలానికల్లా అణాపైసల్తో అద్దె చెల్లించి తీరాలన్నారు. దీపాల చార్జి, నెలకి రెండు రూపాయలు. అదికూడా ఆవేళకే చెల్లించాలన్నారు. రాత్రి పదకొండు దాటితే దీపం వెలిగించ వీలులేదన్నారు. ఆ గదిలో నాతో వాటాదారు డెవడూ ఉండకూడదన్నారు. తల్లీ, చెల్లెలూ, కూతురూ, ముసలి పని మనిషి తప్ప నా గదికి ఆడపురుగైనా రాకూడదన్నారు. నేను అల్లరి చేయరాదన్నారు. బుద్ధిగా ఉండాలిస్మీ అన్నారు. ఇలా ఆయన షరతులన్నీ వల్లించేస్తుంటే నేను అడ్డుతగిలి, "సరేనండీ, గురువుగారూ! అన్నీ మాత్రం ఏకరువు పెట్టకండి, దయచేసి నా కంతా బోధపడింది. లెండి" అన్నాను. అలా అంటే అతను ముఖం చిట్లించుకున్నాడు. కోపం వచ్చిందని గ్రహించి, టక్కున పది రూపాయల కాయితాలు రెండు తీసి, కరకరమనిపించి, "ఏడ్వాన్సుంచండి" అన్నాను. అతను రెండు నోట్లనీ గప్పున చెరోచేత్తోనూ తీసుకొని బనీను జేబులోకి తోసేసి, తిరిగి నావైపు తిరిగి, ఏదో మర్చిపోయినవాళ్లా ముఖం పెట్టేడు. డబ్బు పుచ్చుకోక ముందు ఏ మూడ్‌లో వున్నాడో డబ్బు పుచ్చుకున్న తరువాత మర్చిపోయేడు గురుడు.

"రశీదు అక్కర్లేదులెండి" అన్నాను.

"దానికేఁవుంది? ఇస్తాను" అన్నా డాయన.

"అవసరంలేదు; కాని, ఇందాట్లా వరండాలో చూసేను - ఆడపిల్లేనా?" అని అడిగేను.

"ఏది? ఎవరు? ఓహో? ఆఁఆఁ! ఆడపిల్లే" అన్నాడాయన.

"నా గదికి రానివ్వకండి. ఆడపిల్లలంటే నాకసహ్యం" అనేసి సామాను తెచ్చుకుందికి చ(రున వెళ్ళేను.

రెవెన్యూ సర్వీసులో ఉండగా నీలమణిగారు రెండు ప్రపంచ యుద్ధాల తాకిడి చూసేడు. పర ప్రభుత్వపు బూటు బరువు మోసి చూసేడు. ప్రజల తిరుగుబాటు చూసేడు. గాంధీగార్ని చూసేడు. ప్రతిరోజూ, శని ఆది వారాలు కూడా, ఆఫీసుకి వెళ్ళి సేవ చేసిచేసి చివరకి తాశీల్దారీ చూసేడు. రిటైరయేడు. ఇల్లు కట్టేడు. నా పావువాటా కాక రెండు వాటాలు అద్దెకిచ్చేడు. అతగాడు ముష్టి వాళ్ళని వెంటతరుముతాడు. పసిపిల్లల్ని దూరంగా ఉంచుతాడు. బేరం ఆడి ఆడి కూరలు కొంటాడు. నువ్వు కొన్న పేపరు ప్రతిరోజూ చదువుతాడు.

నీలమణి

పేరుమాత్రం నాకు నచ్చింది. అతణ్ణి చూసినా, అతడి కుటుంబంలో ఎవర్ని చూసినా నా కిష్టంలేదు. అతను చచ్చిన చింతమొద్దులా ఉంటాడు. కరిచిచూస్తే గండుపుల్లగా ఉండి తీరుతాడు. అతగాడి భార్య ముదిరి పోయిన బాడిదమానులా ఉంటుంది. ముట్టుకుంటే ముళ్ళుంటాయి. తరువాత, మీరు చూసేరో లేదో - కొన్ని కొబ్బరిచెట్లుంటాయి. నిటారుగా గంభీరంగా ఉంటాయి. కాయలు మాత్రం కాయవు. అంతా డాబూ అసలు సున్నాను. నీలమణికి అటువంటి కొడుకున్నాడు. అప్పట్లో 'లా' చదువుతూ నూనె కంపెనీలో నౌఖరీకి ప్రయత్నం చేసేవాడు. నీలమణి కూతురు చీకట్లో తుమ్మడొంకలా ఉంటుంది. అల్లుడామెని బాగా చూసేక జడుసుకున్నాడు; విడిచీసేడు. ఆవిడకో ఆడపిల్లుంది. పిల్లకాదు. పిల్లి, పెంపుడుది.

అందుచేత,

నీలమణిగారి కుటుంబంలో ఎవర్ని చూసినా నా కిష్టం లేదనేది స్పష్టం.

అయితే, వాళ్ళ వీధిగదిలో కిటికీ దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చొని ఆ మావిడి చెట్టుని చూడ్డం నా కెంతో ఇష్టం. కొంచెం కుడిచేతి పక్కగా ఓ ఇరవై అడుగుల దూరంలో ఉంటుందది. ఎడంచేతి పక్కగా ఏవో రెండు పాదులు తప్పించి ముందు ఆవరణలో మరేమొక్కా కూడాలేదు. ఆ మావిడి చెట్కొంచే సూర్యుడూ చంద్రుడూ ఉదయించేవారు. దాని చివర్నే రాత్రివేళ చుక్కలు చిందులు తొక్కేవి. దాని కిందనే పగటివేళ ఎండా నీడా ఆడుకొనేవి. దాని నీడనే వీధిలో ఓ ముసలమ్మ మొక్కజొన్న పొత్తు లమ్ముకొనేది. దాని కొమ్మల్ని నేను చూస్తూండగా, చిలకల జంటలు ఎగిరొచ్చి వాలేవి. ఆ రెమ్మలమీది గాలి విసురుకే ఎన్నో మధురానుభూతులు జలజలా వచ్చి నన్ను ముంచెత్తి పారేసేవి.

ఆ మావిడి చెట్టంటే నా కెంతో ఇష్టం. అయితే .....

ఓ రోజున, మకిలిగా లేకుండా నిగనిగ లాడుతూ రాత్రంతా శుభ్రంగా ఉంది. మబ్బులేదు. చంద్రుడు లేడు. ఆకాశపు చీకట్లో చుక్కలు, నూనె దీపపు వెలుగులో పసిపాపల కళ్లల్లా, మిలమిల మెరుస్తున్నాయి. గాలిలో కదలిక లేదు. కాని, చల్లదనం ఉంది. నేను యథాప్రకారం కిటికీ దగ్గర కుర్చీలో కూర్చున్నాను. ఎదురుగా మావిడిచెట్టు ముసుగేసుకు వచ్చిన ఆడపిల్లలా నిల్చుంది. రాత్రి ఎనిమిదే అయింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. అంతలోనే, పచ్చని వాసనతో బరువుగా బద్ధకంగా ఉన్న గాలిని వత్తిగిలించుకొని, సన్నగా వినవచ్చింది, ఒక కమ్మని పాట. ఎక్కణ్నించో నెమ్మదిగా వస్తూ, మధ్య మధ్య దారి తప్పిపోయి ఎక్కడికో పోతూ మళ్ళీ నా దగ్గరకి దారి చూసుకు వస్తోంది. దాన్ని పట్టుకు దాచేసుకోవా లనిపించింది నాకు. అంత హాయిగా ఉందది. పాట వింటూ, మరింత హాయికోసం, సిగరెట్టు అంటించి, పొగలాగి ఒదిలి కాసేపు కన్ను మూసేను.

కన్ను తెరిచే సరికి ఎదురుగా ఉన్న ఆడపిల్ల ముసుగు తీసేసుకొని, పచ్చగా, దీపం వెలుగులో ధగధగా మెరుస్తోంది. నే నాశ్చర్యపోయేను.

మరేం లేదు. పక్కింటివాళ్ళు ఆ చెట్టుకొమ్మకి జిగజిగలాడే విద్యుద్దీపాన్నొకటి వేళాడ దీసేరు. దాని కింద ఓ మేజా వేసి, చుట్టూ నాలుగు కుర్చీలు వేసుకొని నలుగురు పెద్దమనుషులు పేకాడు కొంటున్నారు. "ఇక్కడ బావుందిరా" అని ఒకాయన అన్నాడు. "ఇన్నాళ్ళూ కనిపెట్టలేదేం?" అని ఒకాయన ప్రశ్నించేడు. "కాయలు తెంపడానికే గాని చెట్టుని మరోలా వాడుకోడం తెలీదు మనవాడికి" అన్నాడు మరొకాయన. "నీలమణి విన్నాడంటే నిన్నూ నన్నూ కలిపి నవిలి మింగియగలడు; గట్టిగా మాటాడకు," అని పక్కింటాయన కాబోలు మిగతావాళ్ళని హెచ్చరిస్తున్నాడు. "ఆకులన్నీ వాడివి, కాయలన్నీ వీడివి" అని ఒకాయన విరగబడి నవ్వేడు.

ఆ మాటలు నీలమణి వింటేనో? అని నే ననుకొంటూ ఉండగానే వరాండాలో ఏదో అలికి డయింది. నెమ్మదిగా లేచి వెళ్ళి చూసేను. పొదల మాటున పొంచి చూసే అడవిమృగంలా, ఆ చీకట్లో వరాండాలో నిల్చొని ఆ వైపు చూస్తున్నాడు నీలమణి. ఆ సమయంలో నా కతణ్ణి చూడ్డానికి భయం వేసింది.

నాలుగు రోజులపాటు కాబోలు ఆ చెట్టుకింద రాత్రివేళ పక్కింటి వాళ్లు పేకాట్టడం గమనించేను. అయిదోరోజు సాయంకాలం నీలమణి నాగదిలోకి వచ్చి "చూసేవా, అబ్బాయ్?" అన్నాడు.

అతణ్ణి కుర్చీలో కూర్చోమని చెప్పి, "ఏఁవిఁటి చూడ్డం?" అని అడిగేను.

అతను కూర్చోలేదు. మాసిన బనియన్తో, ఎర్రని పంచెతో అతను, పొగపట్టిపోయి కాలీకాలని చింతమొద్దులా ఉన్నాడు. పక్కింటి వైపు చూపిస్తూ "వాళ్ళ పోయీకాలం చూసేవా?" అని అడిగేడు.

"అవును. పేకాట మంచిది కాదు" అని నే నన్నాను.

"మంచిదో చెడ్డదో - ఆడుకునే దేదో వాళ్ళింట్లో ఆడుకోమను. వల్లకాకపోతే వల్లకాట్లో ఆడుకోమను. ఆడుకుని సర్వనాశనం అయిపోమను. నాకేం నష్టంలేదు. ఆడుకునే వెధవలు ఎక్కడో ఆడుకోక నా చెట్టుకిందా ఆడతారు?"

"జాగా వాళ్ళదే కదూ?"

"అయితే అయింది. నా చెట్టుకిందమాత్రం ఆడ్డానికి వీల్లేదు"

"అలా అని వాళ్ళతో చెప్పండి"

"చెప్పనూ? చెప్పేను."

"చెప్తే ఏవంన్నారు?"

"నువ్వెవడి వన్నారు?"

"అంటే మీరేవింటన్నారు?"

"నేనెవణ్నో తెలుస్తుంది! తెలుస్తుంది కదూ!" రివ్వున వెళ్ళిపోయేరు నీలమణిగారు.

ఆ మావిడిచెట్టు నిజంగా నీలమణిదే కాని, దాని మానుమాత్రం ఆయన జాగాలో ఉంది. మంచి మంచి కొమ్మలూ రెమ్మలూ కూడా కొన్ని రోడ్డుమీదికీ, కొన్ని పక్కింటివారి జాగాలోకీ పారిపోయేయి. దానికి ఎవరేం చేస్తారు?

మరి రెండురోజులనాడు - ఆదివారం ఆవేళ - ఊరంతా తిరిగి, తిరిగి, మధ్యాహ్నం ఒంటిగంటయింది కాబోలు, బసకి తిరిగి వస్తున్నాను. వచ్చేసరికి వీధిలో చాల అల్లరిగా ఉంది. ఓ చింపిరిజుట్టు ముసలమ్మ ఎవర్నో కాని ఎంపుడు తిట్లు తిడుతోంది. వింటే చెవులు చిల్లులు పడిపోవాలన్నమాట. దగ్గరకెళ్ళి చూస్తే ఆ ముసలమ్మ మొక్కజొన్న పొత్తుల ముసలమ్మ. యుద్ధం ఒకటి అప్పుడప్పుడే ముగిసిందనీ, ముసలమ్మ విజయం పొందిందనీ, శత్రువు మాత్రం పిలక చిక్కకుండా పారిపోయేడనీ గ్రహించేను.

"ఏం ముసలమ్మా! ఏవిటి అల్లరి?" అని అడిగేను.

"అదిగో బాబు! ఆ బోడిముండకొడుకు!" వాడి వల్ల అల్లరంతా వచ్చిందని చెప్పిందామె.

నీలమణికి ఖచ్చితమైన గుండుంది.

"ఏం? ఏవంన్నాడు?"

"ఏటన్నాడా? సెట్టాడిదంట. కొమ్మలాడివంట. మరి మావుం ఈ సెట్టుకింద ఇక్కడుండడాని కీల్లేదంట. లూసెన్సు గుందంట! ఆ డుండడం నాకు "లూసెంసు" గుంది. అయితే పోతాడా? పోడు. జాగా ఆడిది. కానైతే, బాబూ, తెలకడుతాను, ఈ

రోడ్డు కూడా ఆడిదేనా?! డబ్బెట్టి కొన్నాడా? నేకపోతే తారూకంకరా కొని కూలోళ్ళసేత దగ్గిరుండి ఏయించినాడా? బోడిగుండూ ఈడూ ఈ రోడ్డుమీద నడ్డానికి ఈ డొక్కాడికే అక్కుందా? ఆ డొక్కాడిదే అక్కని ఏదీ మళ్లీ అనమను. అంటే బోడి గుండు బాగుజేస్సి, ఆడిపెల్లాన్ని సంతకీ, ఆడి కూతుర్ని రేవుకీ అంపకపోతే...." తను తనూ, తన తండ్రి తనతండ్రీ, తన మగడు తన మగడూ కానట్టేనని శపథం చేసింది ముక్కాజొన్నల ముసలమ్మ.

రోడ్డుమీది నీడకూడా తన ఆదాలోనే ఉండాలని నీలమణి పట్టుపట్టడం నాకేం నచ్చలేదు. అంతకు మూడ్రోజులముందు అతను వేయించిన వెదురుకంచె దాటి వరాండాలో అడుగు పెట్టేసరికి నీలమణిగా రబ్బాయి ఎదురయేడు.

"ఏవిటలా నిల్చున్నారు?" అని ప్రశ్నించేను.

"తిట్లు వింటున్నాను." అన్నాడతను.

"ఏం చేస్తాం?" అన్నాను.

"అదేనండీ! ఏం చెయ్యలేం. ఈ లోక్లాస్ నీచపు వెధవల్తో చాలా చిరాగ్గా ఉందండీ" అన్నాడతను.

మరి రెండు రోజులకి వ్యవహారం కొంత ముదిరింది. నే నారోజున ఏడుగంటల రాత్రికి, ఇంటికి (అంటే గదికి) వచ్చేను. పక్కింటివాళ్ళు అప్పుడే ఆటలో నిమగ్నులై ఉన్నారు. అయితే, చెట్టుకిమాత్రం దీపం లేదు. టేబిల్ లైటొకటి పెట్టుకుని ఆడుకొంటున్నారు. వరండాలో కుర్చీనిండా ఉన్నాడు నీలమణి. నేను వెళ్ళగానే "ఇవాళ చెట్టుకి దీపం పెట్టేరుకారు చూసేవా?" అన్నాడు.

"చూసేను," అన్నాను.

"పెడితే చంపేద్దును."

వాళ్ళని చంపడానికి వీల్లేకుండా ఆ దీపం, చెట్టు మీంచి బల్లమీదకి దిగిపోయినందుకు నీలమణి చాల బాధపడ్డాడు.

"కాని, దొరక్కపోరు. అప్పుడు పని పట్టించకపోను" అన్నాడు.

చూదామన్నాను.

"దానిపని ఇవాళయిందిలే" అన్నాడు.

"దేని పని?"

"గింజ లమ్ముకునే ముండ! ఆ తాటకి ముండ పని."

"అరె! ఏమయింది?"

"మీ రోడ్డుర్రా వెధవల్లారా అన్చెప్తే, కానట్టూరుకున్నారు మునిసిపల్ వెధవలు.

అప్పుడు బీటు వాడికి మూ(డ్రూపాయలిస్తే ముండని జుట్టుపట్టుకు గొరగొర ఊడ్చేసేడు. లేకపోతే, దానికి హక్కుఁందిట హక్కు!"

మర్నాడు రాత్రి నేను లేటుగా బసకి చేరుకొనే సరికి నీలమణి నిప్పులు తొక్కుతున్నాడు. వరండాలో చీకట్లో, అవనత వదనలై, ఇంట్లోంచి పీనుగు పోయి నట్టుగా కూర్చున్నారు అతని భార్యా, కూతురూను. నేను వెళ్ళేక కూడా వాళ్ళని ఇంట్లోకి "పొండి పొండి" అనలేదు నీలమణి. పరిస్థితి చాలా సీరియస్‌గా ఉన్నదన్న మాట.

పరిస్థితి చాలా సీరియస్ గానే ఉంది.

ఆవేళ మధ్యాహ్నం, అంతకు ముందెంత సేపటి ముందు కట్టేరో కాని, పక్కింటివాళ్ళ పిల్లలు మావిడి చెట్టు కొమ్మకి ఉయ్యాల కట్టడవేఁ కాకుండా, ఊగుతున్నారుట కూడాను. దిగమనీ, తీసేమనీ నీలమణి కేకలు వేసేట్ట. వాళ్ళు దిగాలేదు. తియ్యాలేదు. అప్పుడు తను ఆయుధం పట్టుకు బయల్దేరేట్ట. వాళ్ళ జాగాలో 'అడుగు పెడితే చాలు! తంతాం" అన్నారుట వాళ్లు. చిన్నపిల్లలే తంతామన్నారుట. ఇతను మోటాయించ బోయేట్ట. వాళ్లు రాళ్లు తీసేరుట.

కొట్టుకోలేదు కద!

"నే నడ్డేసే న్నాయనా! లేపోతే నెత్తులు బద్దలై పోను" అంది నీలమణి భార్య.

ఇవతల ఈలోపున మొక్కజొన్న పొత్తుల ముండ మళ్ళీ వచ్చిసిందిట. పోలీసువాడితో మళ్లీ చెప్తే "బీద ముండ, పోనిద్దురూ" అన్నాట్ట. వాడు దానిదగ్గిర రోజుకి రెండుపొత్తుల చొప్పున తీసుకొందికి వాడికీ దానికీ వప్పందం కుదిరిందిట.

"కుదరకపోతే, ఆ ముండ మళ్ళీ రాగల్దా? ఎన్ని గుండెలుండాలి? బీటు వెధవమీద కాయితం తగిలించిసేను. సంతకంలేదు. ఎవ(రాసేరో! సరి. అదలా ఉంచు. ఇప్పుడు ఉరితాళ్ళా నా పీకలమీదుందికదా, ఈ ఉయ్యాలా నేం చెయ్యడం? పోలీసు రిపోర్టిద్దాం? నీ కెవర్నయినా పోలీసువాళ్లని తెలుసా?" అన్నాడు నీలమణి.

పోలీసువాణ్ని తెలియడం ఆఫీసర్లకీ, షావుకార్లకీ, అటువంటి మరో పై సా ఉన్నవాడికీ మంచిది కాని మనలాటి వాళ్ళకి మంచిదికాదు. పైపెచ్చు ప్రమాదం కూడాను. అయినా, నా కెవర్నీ పోలీసువాళ్ళని తెలీదు. అలా అని నీలమణితో చెప్పేను.

"పోలీసాఫీసులో పన్చేస్తున్నావు కదా, తెలియక పోవడం ఏఁవిఁటి?" అని నామీద ఎగిరేడతను.

"నేను మేస్ట్రీటు కోర్టులో గుమాస్తాని"

"మరేఁవీ?"

"కొత్తగా ఒచ్చేను. నా కెవర్నీ తెలీదు,"

"పోనీ అయితే, కాని నీకు ప్లీడర్లనైనా తెలిసుండాలి. తెలీదంటే వీల్లేదు."

"ఒకరిద్దర్ని తెలుసు."

"మంచివెధవలేనా?"

"అంటే?"

"సలహాకూర్కూడా ఫీజు అడగరుకద!"

"ఏమో నేనేం చెప్పగలను!"

రాగాపోగా నన్నే ఆ ప్లీడర్ల దగ్గిర సలహా పుచ్చుకో మన్నాడు నీలమణి. నాకాపని తప్పింది కాదు.

ఆ ప్లీడర్లు ఏం చెప్పారంటేః అసలు నీలమణిగారి చెట్టు కొమ్మలు ఆ పక్కింట్లోకి చొరబడ్డానికే వీల్లేదట. వాటిని వాళ్ల కొట్టిపారేసి ఆకుల్తో సహా ఈయ నింట్లో పారేస్తే వాళ్లని చేసేదేం లేదట.

దాన్తో, నేనూ నీలమణీ కూడా భయపడ్డాం, కొమ్మలు వాళ్ళు కొట్టేస్తారేమోనని. కాని నీలమణి కొంతసేపు ఆలోచించి –

"కొట్టరు" అన్నాడు.

ఎందుకు కొట్టరు?

"కొట్టేస్తే కాయలుండవే!"

ఉండకపోతే?

"నీకు ప్రపంచజ్ఞానం లేదు. అవి లాగుదామన్నదే కదూ వాళ్ళ దొంగబుద్ధి!" అన్నాడు నీలమణి. అలాటి బుద్ధిని సులువుగా కనిపెట్టగల డతను.

"రేపు వాళ్ల ఇంకా ఏదో అల్లరిపెట్టదల్చుకున్నారుట. పనిమనిషి చెప్పింది" అంది నీలమణి కూతురు.

ఇదేదో చిలికిచిలికి గాలివానగా మారేట్టుందనుకున్నాను మనసులో.

అలాగే జరిగింది కూడాను.

అదెలా అంటే –

మర్నాడు సాయంకాలం నేను గది కొచ్చేసరికి ఇంటిదగ్గిర నీలమణి లేడు. రోజూ గుమ్మంలో కుర్చీ వేసుకూర్చొని పాపపులోకాన్ని తీవ్రంగా పరీక్షించడం అతనికి అలవాటు. ఆరోజుమాత్రం సీట్లో లేడు. ఇల్లంతా అతి నిశ్శబ్దంగా వుంది. ఏదో అయిందిరా అనుకొంటూ నా గది తలుపు తెరిచేను. తెరిచిన చిరుచప్పుడు వింది కాబోలు అతని భార్య బైటకొచ్చింది.

"నీలమణిగా రేరీ?" అని అడుగుతే

"నాకు నోటంట మాట రావడంలేదు" అందావిడ.

"ఏం? ఏం జరిగింది?" అన్నాను.

"ఖూనీలు జరిగిపోవలసింది" అందావిడ.

మధ్యాహ్నం సరిగ్గా ఒంటిగంట! ఆయన గడియారాని 'కీ' ఇస్తున్నారు. గొల్లున కేకలు వినపడ్డాయి. ఏవిటా అని చూద్దుం. వానరసైన్యంలా వచ్చీసేరు వేలెడేసి వెధవలు పక్కింటికి. రావడం ఏవిటి, మా చెట్టెక్కడ వేవిటి? ఎక్కి ఉయ్యాలా రంయ్‌మని ఊగడవా, కొమ్మలు పెళ పెళ విరిచీడవా, ఆకులన్నీ తెంపి ఎగరెయ్యడవా! వాళ్ళు చెయ్యంది లేదు. ఆయన "దిగండ"ని కేకలేస్తే వాళ్లు తిట్టిన తిట్లు ఇన్నీ అన్నీ కావు. కడజాతివాళ్లు కూడా అలా తిట్టుకోరు. అంతలో – మా పిల్లదాని పిల్లి! చూసే ఉంటావు. ఎలకనైనా ముట్టుకోదు. గోవుతో సమానం అనుకో. నోరెరగని జంతువు ఎరక్క మధ్యకి వెళ్ళింది. వెళ్తే – వెధవ లందరికీ పక్షవాతాలొచ్చి పడిపోతార్లే – వెళ్తే 'మాజాగాలోకి ఎందుకు రావా'లని తోక పట్టుకు గిరవాటేశారు. వాళ్ల మనిషి పిల్లలేనా? అయినా, పెద్ద వెధవలే అంతా వెనకనించి చేయిస్తే వాళ్ళననేం లాభం? ఇంతకీ పిల్లికాలు విరిగి పోయింది. దాని బాధ ఇంట్లో ఎవళ్ళం చూళ్లేపోయేం. నువ్వా చూద్దువుగాని, దాన్నికూడా పోలీసుస్టేషనుకి పట్టుకెళ్ళారు.

"పోలీస్టేషన్ కెందుకూ?" అని నే నడిగేను.

"ఏం చెప్పన్నాయనా? మా పిల్లి కాలు విరిచేసి, మమ్మల్ని అనరాని దుర్భాషలాడి, మా చెట్టు నాశనం చేసి అంతా వాళ్లే చేసి, పై పెచ్చు 'మేవే' వాళ్ళని కొట్టేవని పోలీసు రిపోర్టిచ్చేరట. పిల్లిపిల్ల అలా కుయ్యో మొర్రో మంటూంటే మా పిల్ల చూళ్ళేక శోషొచ్చి పడిపోయిందికదా. అది కర్రపేడు విసిరి వాళ్ల పిల్లణ్ని కొట్టగల్దా? తాసిల్దారు కూతురు కొట్టగల్దా? కొట్టిందని రిపోర్టిచ్చేరుట? వాళ్ళ పోయీకాలం చూసేవా? మరి ఈయన కూడా రిపోర్టివ్వడాని కెళ్ళేరు."

ఈ వ్యవహారం ఎలానూ మా కోర్టుకే వచ్చేట్టుందనుకొంటూ నేనా రాత్రి నిద్రపోయేను. అర్ధరాత్రి ఎవరో తలుపుతట్టి కేకవేసేరు. ఎవరా అని లేస్తే, ఇంటికి రమ్మని టెలిగ్రాం, మా స్వంత వ్యవహారం గురించి.

పొద్దున్నే బయల్దేరివెళ్లి నేను మూడురోజులపాటు మావూళ్ళో ఉండిపోవలసి వచ్చింది. వ్యవహారం చివరికి సెటిల్ కాకపోగా, నాలుగోరోజు పొద్దున్న మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చీసేను.

నా గొడవల్లో పడిపోయి నేను మావిడిచెట్టు తగువు గురించి పూర్తిగా మర్చిపోయేను. బండీదిగి రిక్షా ఎక్కి ఏదో ఆలోచిస్తూ, నీలమణి గారింటిముందు దిగి, రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించేసి, సంచీ చేత్తో పట్టుకుని "పొరపాట్న మరోఇంటికి వచ్చీసేనా?" అనుకున్నాను. కాదు, నీలమణిగారిల్లే! నేను నిర్ఘాంతపోయేను. కొంతసేపు అలా నిల్చుండిపోయేను.

తరువాత లోనికి వెళ్ళి, నీలమణిని కేకవేసి పిల్చి

"ఇదేవిఁటండీ, ఈ అన్యాయం?" అని అడిగేను. అడిగితే, అతను దుమ్ములగొండిలా ముఖం పెట్టేసేడు. కేకలు వేసేడు. నన్ను కొట్టినంత పనిచేసేడు. అతను ఆడిన మాటల్లో మంచివి తక్కువ, బూతులు ఎక్కువ. దుమ్ములూ మాంసవూఁ కక్కినట్టుగా మాట్లాడేడు.

అతను చెప్పిన మాటల సారాంశం ఇది :

నా ఇష్టం ఒచ్చినట్టు చేస్తాను. నేనేం చేసుకుంటే చేసుకుంటాను. అడగడానికి నువ్వెవడివి? వాడెవడు? మరొకడూ, మరొకడూ ఎవడైనా ఎవడు? అందులోనూ నువ్వా నన్నడిగేవాడివి? చాతనయి ఏదైనా అడగాలనుంటే, ఆ వెధవల్ని వెళ్ళి అడుగు. నేను నిజం కేసు పెట్టేను. కాదంటావా? అనగలవా నువ్వు? ఎవడైనా అనగలడా? మరి వాళ్లు నామీద పెట్టింది? పచ్చి అబద్ధాలేఁ కద! నేను పచ్చగా వుంటే చూళ్ళేక, నామీద అబద్ధం కేసుపెట్టి నా చూరుకి నిప్పంటించేరుకద! నా నీడని చేరి, ఇంటిపక్క వెధవలు, వీధిలో ముండలు అంతా నా నీడన చేరి కిందనించీ ఎసరు పెట్టేరు కద! పైన పంగనామాలు పెట్టేరుకద! ఆఖరికి నా నీడైనా నాకు దక్కలేదుకద! కాయలు కాస్తే అవి నాకు దక్కుతాయనా నీ ఊహ? దక్కుతాయని నువ్వు పత్రం రాసి నా కివ్వగలవా? ఆ వెధవలు తెంపకుండా కాస్తావా నా తరఫున? వీధిలో ముండలు అందినవన్నీ తెంపుకుపోకుండా నువ్వు నాకు పారా ఉంటావా? నా కొమ్మలు నాకు లేవు. నా ఆకుల్నాకు లేవు. నా నీడ నాకు లేదు. నాకు దక్కంది నేన్నీకు ఉండనివ్వను. ఆకు పిసరైనా నాది నేన్నీకివ్వను. ఎందుకివ్వాలీ? చెట్టు నీదైతే ఆకులో అరసగం నువ్వు నాకిస్తావా? వాణ్నాకిస్తాడా? అంచేత – నాది నా ఇష్టం ఒచ్చినట్టు చేసుకుంటాను.

నీలమణితో వాదించి ప్రయోజనం లేదు.

అతగాడి గుండులా ఇల్లంతా బోడిగా ఉంది.

ముందు ఆవరణంతా శ్మశానంలా ఉంది. కొమ్మలన్నీ ముక్కలు ముక్కలై పోయేయి. మానుమానంతా తుండ్లు తుండ్లుగా తెగిపోయింది. ఆకులన్నీ వాడి ఎండి రాలి చచ్చి గాలి కెగురుతున్నాయి. ఇల్లంతా నిర్భాగ్యంగా కళావిహీనంగా, చూడ్డానికి దుర్భరంగా పీనుగుల పెంటతో నిండినట్టుగా ఉంది. నేనుండే గదంతా ఎండకి బొగులూ బొగులూమని మండిపోతోంది. వీధిలో ముసలమ్మ ఏ ఎండకో పోయుంటుంది.

నేను మాత్రం ఆ మర్నాడే గది ఖాళీచేసేశాను.

ఈ విషయమంతా ఇంతగా వివరంగా ఎందుకు చెప్పేనంటే :

ఆ ఇంటి వెధవల్నీ, ఆ ఇంటి పక్కింటి వెధవల్నీ, వాళ్ల వాళ్ల తగువుల్నీ, వాళ్లు ఎక్కే కోర్టుల్నీ, అక్కడ జడ్జీలనీ, ప్లీడర్లనీ, పార్టీలనీ, పోలీసుల్నీ, ఈ జెయిళ్ళనీ,

సంకెళ్ళనీ ఎరగనివాళ్లచుట్టూ అంతా కలిసి చుట్టే పాశాల్నీ - అంతా చూస్తూంటే నాకు "మరి లాభం లేదు, ఈ మనిషి వెధవలు మరింక బాగుపడరు. ఈ లోకం, ఇదంతా ఘోరమైన నరకం" అనిపించి బతకడం దుర్భరంగా తోస్తుంది.

కాని, అంతలోనే -

తళతళలాడే తెల్లని ఎండా, తల్లిలాటి చల్లని మబ్బూ, పూచిన లేమామిడి మొక్కా, ఎండలో పల్లె పిల్ల బరువు నడకా గుర్తుకొస్తాయి. పొలాలమీద గాలి జ్ఞాపకం వస్తుంది. వర్షంలో అక్కడి మనుషులు గుర్తుకొస్తారు. పకపకలాడి పనిచేసే ప్రజాసమూహమంతా ఎదరకొస్తుంది. నీడకోసం పోరాడిన ముసలమ్మ నా దృష్టిపథంలో ఎప్పుడూ నిల్చి వుంటుంది. అప్పుడు నాకు కొంచెం ధైర్యం వచ్చి, ఫరవాలేదు, ఆ నరకాన్ని తోసి పారెయ్యొచ్చు, కష్టపడైనా ఆనందాన్ని నిల్పుకోవచ్చు అనిపించి నాలోని ఆశ కొంతగానైనా నిలుస్తుంది.

యువ, జనవరి, 1961